1986 అక్షయ దీపావళి కథల పోటీలో రు. 500లు బహుమతి పొందిన ఉత్తమ కథ

# చెంబుకొక గంగ



అంకయ్య ఆ వాడకు కానుగచెట్టు నీడ!


ఆ వాడలో అంకయ్య అందరిలాంటి మనిషే! అందరికీ వున్నట్టు అతడికీ ఒక తలకాయ వుంది. ఆ తల దాచుకోవడానికి అందరికీ వున్నట్లే అతడికీ ఒక చుట్టుగుడిసె వుంది.

అయితే అంకయ్య మిలిటరీ రిటర్డ్స్!

మిలిటరీకి వెళ్ళక మునుపు అంకయ్య పేరు అంకడు.

అప్పుడు వాడలో పట్టుమని పది ఇండ్లు వుండేవి. ఆ పది ఇండ్లల్లో అంకడికొక్క యిల్లు లేదు. వాడు పుట్టూనే తల్లి పోయింది. ఆ తర్వాత ఆమెను వెదుక్కొంటూ తండ్రి పోయినాడు. అంకడు ఏకాకి అయినాడు. అప్పుడు వాడి వయసు అయిదేండ్లు.

# పులికంటి కృష్ణారెడ్డి




అయిదేండ్ల అంకడు గోగుపుల్లలా సన్నగా వుండేవాడు. ఎండిన కరూడులా కంపుకొడ్తూ వుండేవాడు. గజ్జికుక్కలా వొళ్ళంతా జిడ్డు కారుతుండేది. ముక్కులో చీమిడి తొంగిచూస్తూ వుండేది. ఎడమచేతి బొటనవేలిని విడవకుండా చీపుకుతూ వాడలోనో, ఊళ్ళోనో దేబిరిస్తూ తిరిగేవాడు. ఏ తల్లి అయినాదయతలచి అంత ఎదిలిస్తే విందనుకునేవాడు. లేకుంటే ఏ పంచమీదనో పడి నిద్రపోయేవాడు.

అయితే కాలం వాడితో కలిసి నిద్రపోలేదు. క్రమం తప్పకుండా తన పని తాను చేసుకుంటూ వుంది. వున్నవాడికి ఒక్కడైతే అడుక్కుతినేవాడికి అరవై. వాడలో గుడిసెలు... ఊళ్ళో యిండ్లు అన్నీ వాడివైనాయి. ఇంటికొక్క కూడు. ఇంటికొక్క కూర. పూటకొక్క ఇల్లు. గోగుపుల్లలాంటి అంకడు ముద్దుగా, బొద్దుగా చేమకూర దంటులా మన్నంగా తయారైనాడు.

ఇప్పుడు సానుభూతి చోటులో సలహాలు చోటు చేసుకుంటువున్నాయి.

అంత అన్నం వాడి మొగాన విదిలిస్తూనే "ఒరే అంకా! ఇంక యాడైనా అంత పనీపాట సూసుకోరాదంట్రా?' అని ఊళ్ళో అమ్మలక్కలు అంటువున్నారు. వాడు వింటువున్నాడు. విని ఆలోచిస్తున్నాడు.

అంతలోనే అయివేరోళ్ళకు అంకడి మీద కన్ను పడింది.

కన్ను పడిందని అయివేరోళ్ళు వల పన్నవలసిన అవసరం లేకపోయింది. 'రారా అంకా!' అని పిలిస్తే వచ్చినాడు. 'గొడ్డూ గోదను మేపరా!' అంటే మేపుతున్నాడు.

సాధారణంగా ఈ దేశమాత బిడ్డలు గొడ్డూ గోదను మేపడానికనే చేర్తారు. కురుకురు మీస మొచ్చేసరికి పారా పలుగు చేతికందుకుంటారు. ఆ తర్వాత మేడి పట్తారు. మేడి పట్టిన చేత్తోనే ఎవతె మెడనో వంచి తాళి కట్తారు. తాళి కట్టడానికైన ఖర్చు రైతు లెక్క కట్తాడు. ఆ లెక్క తీర్చడానికి రాత్రింబవళ్ళు చెమటోడ్చుతాడు. అది తీరదు. తీరేదాక వాడి కాలు బయటపడదు. ఇది ఒక విడదీయరాని బంధంగా మిగిలిపోతుంది.

అయివేరోళ్ళకు అంకడికి యిట్లాంటి బంధమే ముడిపడాల్సింది.

అయితే అది రవ్వంతలో తప్పిపోయింది.

ఒకానొక దినం. పొద్దుగూట్లో పడింది. కమచీకట్లు ఆవరిస్తూ వుంది. అంకడు అడవి నుండి ఆవుల్ని తోలుకొని యింటికి వస్తున్నాడు. ఆవులు నాయున చెరువు మొరవలో నడుస్తున్నాయి. అంతలో ఎక్కడ పొంచి వుండిందో చిరుత. ఆలమందమీద పడింది. ఆవులు బెదిరి మోరసాచి తోకలు పైకెత్తి అరుస్తూ దిక్కుకొక్కటైనాయి. అంకడు గోడకు కరుచుకున్న బల్లిలా... శివలింగాన్ని వాటేసుకున్న మార్కండేయుడిలా ఒకానొక చెట్టును కౌగిలించుకున్నాడు. ఊపిరి బిగపట్టినాడు. కదిలీ మెదలకుండా చెట్టులో చెట్టయినాడు. చేతికందిన అవకాశం చేజారిపోతే చిందులు తొక్కే మంత్రిలా చిరుబుర్రులాడుతూ, ముంగాళ్ళను నేలకేసి కొట్తూ, గాండ్రిస్తూ ఎటూ తోచని మంత్రిగారు యింట్లోకే వెళ్ళినట్లు అది అడవిలోకి వెళ్లింది.

అటు యిటుగా చెల్లాచెదరైన ఆవులు కొన్ని యిల్లు చేర్నాయి. మరికొన్ని రెడ్డోరి జొన్నచేనిలో పడినాయి. పొట్టకర్ర మీద జొన్న చేను నవనవలాడుతూ వుంది. ఆ చేని మీద పడిన ఆవులు మేసినంతవరకు మేసినాయి. తొక్కినంత వరకు తొక్కినాయి. ఆ తర్వాత తిరిగ్గా ఇల్లు చేర్నాయి.

అంకడికి దడ తీరేసరికి అర్ధగంటకు పైగా పట్టింది.


అప్పుడు వాడు వాటేసుకున్న చెట్టును విడిచిపెట్టాడు. మెల్లగా అడుగు మింద అడుగేస్తూ వెళ్ళినట్లు వెళ్ళి మళ్ళీ అదెక్కడొచ్చి మీద పడ్తుందో? అని బిత్తర చూపులు చూస్తూ ఊరివైపు పరుగందుకొన్నాడు.

అప్పటికే అక్కడ పెద్ద జాతర జరుగుతూ వుంది.

అంకడు కంట పడేసరికి అది శ్రుతి మించింది.

"అయ్యా! మా యబ్బతో దేముడి సాచ్చిగా సెప్తా వుండా. నాయిన సెరువు మొరవలో సిర్తగాడొచ్చి గొడ్ల మీద పడింది. అవ్వి బెదిరి దిక్కుకొగ్గటైనాయి. నేనేవో పెట్టుక్కుర్సకపోయ్‌నా. ఇంక నన్నేం జెయ్యమంటారు సెపుండయ్యా? ఈ తప్పట్లా కాసుకోండయ్యా!" అని లబ లబ మొత్తుకున్నాడు. కాళ్ళా వేళ్ళా పడి బ్రతిమాలినాడు. కానీ ప్రయోజనం లేకపోయింది.

"సిర్తగాడొస్తే విన్నెట్లా వొదిలిందిరా నీయమ్మా నా కొడకా?" అని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్తూ రాతి కూసానికేసి కట్టేసి మక్కెలిరగ తన్నినారు.




పాపం! అంకడు కుక్కనోటికి చిక్కిన కండే అయినాడు.

వాడి మాటల్ని నమ్మినవాళ్ళు కొందరు 'అయ్యో పాపం!' అన్నారు.

"సేతికందిన పైరు నోటికందకపోతే ఎవురికి మాత్రం కడుపు రగల్దు? ఈ లోతు భావిల్లో బానకు బాన తోలి పండించిన పంట! పండించినోడికి తెలుస్తుంది బాద!" అని మరికొంతమంది రెడ్డోరికి వత్తాసు పలికినారు.

అయివేరోళ్ళు మాత్రం అటు యిటు కూడా చెప్పలేక నీళ్ళు నములుతూంటే అంకడి కండ్లలో నిప్పులు కురిసినాయి.

ఆ రాత్రి అంకడి కంటిమీద రెప్ప పడలేదు.

తన తప్పేమీ లేకపోయినా చావతన్నినందుకు రెడ్డోరి మింద కసి. రాతికూసానికేసి కట్టేసి కొట్తావున్నా పల్లెత్తుమాట అడ్డం పలకని అయివేరోళ్ళ మీద అక్కసు. 'అదే వాళ్ళ బిడ్డయితే అదక్కుడా వుంటారా?' అన్న ఆలోచన మనస్సులో మెదిలితే బాధ. పశువుల కొట్టంలో పడుకున్న అంకడి గుండెలు కుతకుత ఉడుకుతున్నాయి. అప్పుడు ఆలమంద మీద పడిన చిరుత వాడి మనసులో మెదిలింది. ఎగిరి ఆ యింట్లో దూకి చిరుతపులిలా గొంతు కొరికి నెత్తురు తాగితే?— కసి తీరుతుంది. అయితే అదే కాని పని అని తోచేసరికి కాళ్ళెత్తి కడుపులో పెట్టుకొని ముడుక్కొన్నాడు.

అయినా నిద్ర పట్టలేదు.

ఊరు మాటుమణిగింది. రెడ్డోరి జొన్న చేమలో కడుపార మేసిన ఆవులు అరమోడ్పు కన్నులతో హాయిగా నెమరు వేస్తున్నాయి. నల్లరేగడి నేలపై చల్లిన తెల్లని జొన్న గింజల్లా ఆకాశంలో చుక్కలు మిలమిలా మెరుస్తున్నాయి.

అంకడు మెల్లిగా పైకి లేచినాడు. అటు యిటు చూచినాడు. ఊరు నిద్ర వొడిలో వొళ్ళు మరిచివుంది. తన వొళ్ళేమో తీపులు తీస్తూ వుంది. అయివేరోళ్ళ యింట్లో గురకలు కొత్త నీళ్ళల్లో కప్పలు అరిచినట్లుంది. మళ్ళీ ఒక్కసారి కండ్లు చించుకుని కలయచూసినాడు. ఎవ్వరూ చూడడంలేదని నిర్ధారించుకున్నాడు. అడుగు మీద అడుగ్గా అక్కడి నుంచి ఎలబార్నాడు.

ఊరికి ఉత్తరంగా తోపు వుంది. దాని పేరు పెద్ద తోపు. ఆ పెద్ద తోపులో పెద్ద పెద్ద టెంకాయ చెట్లున్నాయి. అవి రెడ్డోరివి!

అంకడక్కడికి చేరుకున్నాడు. తోపు మధ్య నిలబడి దిక్కులు పరికించి చూసినాడు. నరవాసన ముక్కుకు సోకలేదు. మనుష్యులే కాదు చెట్లు కూడా నిద్ర పోతున్నట్లుంది. గోచీ పైకెగ చెక్కినాడు. కొట్టంలో నుంచి తెచ్చిన పలుపును కాళ్ళకు బంధంగా తగిలించుకున్నాడు. కన్నుమూసి తెరిచేలోపల ఉడతలా టెంకాయ చెట్టు పైకి ప్రాకినాడు. పూత పిందెతో సహా దూసి కిందపోసినాడు. గబ గబ కిందికి దిగినాడు. మళ్ళీ యింకొక చెట్టెక్కినాడు. దిగినాడు. ఆ తర్వాత యింకొక చెట్టు. కాళ్ళు పీకుతున్నాయి. అరచేతులు మండుతున్నాయి. రెడ్డోరు కొట్టిన దెబ్బలతో వొళ్ళంతా పచ్చిపుండు మాదిరై నెప్పి పెడ్తూ వుంది. ఆ నొప్పిని భరించడం కష్టంగా వుంది. అయినా పట్టుదల, కసి, ద్వేషం. ఎక్కి దిగని మాకు లేదంటూ ఎక్కి, దిగి కాయ, పూత, పిందెతో సహా దూసి పోసేసినాడు.

అప్పటికి శరీరం స్వాధీనం తప్పుతున్నా మనస్సు కుదుటపడింది.

అంతే! అంకడు మళ్ళీ ఆ ఊళ్ళో అడుగుపెట్టలేదు.

కనిపించిన దారి వెంబడి బతుకు దారి వెదుక్కుంటూ నడిచినాడు. కండ బలాన్ని, ఆ కండల్లో దాగిన గుండె బలాన్ని కనిపెట్టి 'మిలిటరీలో చేర్తావా?' అంటే 'ఓ' అని చంక లెగరేసినాడు. ఇరవై అయిదేండ్లు మిలిట్రీ కొలువు కొలిచినాడు. మీసాలు పెంచినాడు. పై అధికారులు మెచ్చుకుంటే ఆ మీసాల్ని మెలివేసినాడు. 'నీలాంటి బిడ్డను కన్నందుకు దేశమాత గర్విస్తూ వుంది. ఇక నీ సేవలు చాలు. నువ్వు వెళ్ళవచ్చు బాబూ!' అని పైవాళ్ళు అంటే ఎకాఎకిని ఎలబార్నాడు.

ఆ ఊరి నుండి ఎలబారినప్పుడైతే ఏ దారి కనిపిస్తే ఆ దారి వెంబడి నడిచినాడు. ఎవ్వరే పని చెప్తే ఆ పనిచేసినాడు. వాళ్ళు పెట్టింది తిన్నాడు. తిడ్తే విన్నాడు. కాని ఇప్పుడు మాత్రం అటు ఇటు చూడలేదు. ఒకటే దారి. తాను పుట్టి పెరిగిన వాడకు దారి. ఆ దారి పట్టే నడిచినాడు. తన వాడలో తన వాళ్ళ మధ్య అంకయ్యగా నిలబడినాడు.

ఆరడుగుల ఆకారం. ఆ ఆకారాన్ని ఇంకొక బెత్తెడెత్తుకు పెంచుతున్నట్లుగా కాళ్ళకు నల్లని బూట్లు... గుబురు మీసాలు, దట్టమైన కనుబొమలు. ఆ కనుబొమల కింద కాంతులీనుతూ కండ్లు! 'ఎవుడీడు? ఎందుకొచ్చినాడీడికి?' అన్నట్లుగా అమ్మలక్కలు కళ్ళు యింతింతలు చేసి చూస్తున్నారు. పిల్లలు భయపడి తల్లుల చాటులో దాగి తొంగి తొంగి చూస్తున్నారు. వయసు మళ్ళిన ముసలీ ముతకా కళ్ళు చికిలించి చూస్తున్నారు.

అంకయ్య అందరివైపు ఒక్కసారి కలియచూసినాడు. సన్నగా నవ్వుకుంటూ ముందుకు నడిచి 'గంగులు మావా! నేను మావా అంకయ్యని!' అన్నాడు.

అప్పటికీ పోల్చుకోలేక 'ఏ అంకయ్య?' అన్నట్లు చూస్తుంటే—

'అయివేరోళ్ళింట్లో ఆవల మేపతా వుండిన అంకణ్ణి మావా!" అన్నాడు.

"ఒరె వారే పిల్లనాయాలా నువ్వంట్రా? సీవిడి కార్చుకుంటా సింతసెట్ల కింద తిరగతా వుంటివే? ఎంత మారిపొయ్‌నావురా! ఉన్నట్టుండి నువ్వతీగతీ లేకుండాపోతే ఏ బాయి పాలో, గుంట పాలో అయిపొయ్యింటాడనుకొంటిమి గదరా! రారా సాయినా రా!" అంటూ ఆప్యాయంగా పిలిచినాడు గంగులయ్య.

కుర్రకారు సందేహంగా చూచినారు. గుర్తించిన వాళ్ళు కొందరు ఆశ్చర్యపడినారు. మరికొందరు ఆనందపడినారు. ఆనాటి నుంచి అంకయ్య కొందరికి 'మిలిట్రీ అన్న' అయినాడు. కొందరికి 'మిలిట్రీ మావ!' అయినాడు. అంకయ్య ఎవరెట్లా పిలిచినా పలుకుతున్నాడు. పిలిచినా పిలవకపోయినా ఏ యింట్లోనో దూరి వేళకంత తింటున్నాడు. తింటున్నా, తిరుగుతున్నా తీవ్రంగా ఆలోచిస్తూనే వున్నాడు.

తాను వాడను వదిలిపెట్టి పాతికేండ్లకు పైబడింది. అప్పుడు పది గుడిసెలు ఇప్పుడు పాతిక గుడిసెలైనాయి. ఆ గుడిసెల మీద కప్పలేదు. వాడలో ఒక్కడి వొంటి మీద తులం కండ లేదు. ఎవడి వైపు చూసినా ఎముకల గూటికి చర్మాన్ని అతికించినట్లుంది. పిల్లలు ఈసురోమని మరీ హీనంగా వున్నారు. చదువుకోవడానికి బడి లేదు. రోగం వస్తే ఆస్పత్రి లేదు. ఏం బతుకులో? ఎదుగూ బొదుగూ లేని కుక్క బతుకులు. వంచిన నడుం ఎత్తకుండా పొద్దుగూకులూ పనిచేస్తేనే పొట్టకంత తడి పడేది!

వాడలో ఈ పాతికేండ్లలో జరిగిన మార్పు ఏమంటే?- తనకు తెలిసిన వాళ్ళు కొంతమంది చచ్చినారు. తనకు తెలియని వాళ్ళు కొంతమంది పుట్నారు.

## రచయిత గురించి


బతకడానికి డబ్బు అవసరం. ఈ జీవిత సత్యాన్ని ఆవిష్కరించడానికి ఉత్తమ కథ బహుమతి పొందిన రచయితే కానక్కరలేదు. సామాన్యుల్లో సామాన్యుడైనా చాలు. అందుకే ప్రతి మనిషి రూక లేనివాడు పోక చేయలేడన్న అభిప్రాయంతో పలు పాట్లు పడుతున్నాడు. ఆ పాట్లు పలు రకాలు. చెంబుకొక తీర్థమన్నట్లుగా మనిషి మనిషికొక విధానం.

ఈ డబ్బు సంపాదించే విధానం మనిషి మనస్తత్వం మీద, తెలివితేటల మీద ఆధారపడుతుంది.

తెలివిమీరినవాడు తెలివైనవాడిని కూడా దోచే సమర్థత కలిగివుంటాడు.

మార్క్స్ చెప్పినా, మామూలు మనిషి చెప్పినా జరుగుతున్నది మాత్రం ఇదే తంతు!

మార్పును కాంక్షించే మామూలు రచయిత అయినా, మహా రచయిత అయినా తన మనసు మెచ్చే విధానంతో సంపాదించుకుని జీవించడంలో వున్న తృప్తి ఆనందం వేరు!



దేన్నయినా సాధించవచ్చునేమో కానీ, తృప్తిని సాధించడం మహా కష్టం. ఈ సాధనలో ఎదురయ్యే కష్టాల్ని అధిగమించడం మరీ కష్టం. పాతిక సంవత్సరాల కిందట్నే నేను రైల్వేలో అసిస్టెంటు స్టేషన్ మాస్టర్ని. ఆ ఉద్యోగాన్ని వదులుకుని- అంటే ఆ సంపాదన రుచించక, సాహితీ జీవనాన్ని ఎన్నుకుని, కొని తెచ్చుకున్న బాధలతో కొంతకాలం, అలవికాని, అనువుకాని సహవాసాలతో మరికొంత కాలం హరించుకుపోగా మిగిలిన అయిదారేండ్ల కృషిలో ఇది నేను అందుకుంటున్న పన్నెండవ బహుమతి!

చెమటోడ్చినవాడిని కాబట్టే శ్రమ విలువ నాకు తెలుసు.

కథ రాయడానికి కూడా నేను శ్రమ పడతాను.

నా శ్రమను గుర్తించినపుడు సంతోషిస్తాను. లేకపోతే నా కథలకు ఆలంబనాలైన శ్రామిక జీవుల జతలో చేరి ఈ వ్యవస్థ యింతే! అని నిట్టూరుస్తుంటాను.

నా శ్రమను గుర్తించిన ఆంధ్రజ్యోతి సంపాదకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు.

'మంచి కథకుడు!' అనిపించుకోవాలన్నదే జీవిత ధ్యేయం!

—పులికంటి కృష్ణారెడ్డి

పోయినవాళ్ళ బాధ్యతల్ని వీళ్ళు నెత్తికెత్తుకొంటున్నారు. ఇంతేనా? ఈ పద్ధతికి అంతం లేదా? ఈ జీవితాలకు విముక్తి లేదా?

అంకయ్య ఆలోచిస్తూ వాడలో నిలబడి ఊరివైపు చూసినాడు.

అక్కడ మిద్దెలు మేడలైనాయి. పూరిండ్లు మిద్దెలైనాయి. అంకయ్య తల పంకించాడు.

ఆ ఊరికి చుట్టుపక్కల నాలుగైదు ఊళ్ళు. ఊరూరికీ ఒక హరిజనవాడ. ఊరి అడుగుజాడల్లో వాడ నడవాల్సిందే. లేకపోతే వాడకు పూట గడవదు! ఎన్నాళ్ళిట్లా? ఎన్నేండ్లిట్లా?? జరిగినంత కాలం జరిగింది. జరిగిన కాలాన్ని గురించి ఆలోచిస్తే ఒరిగేది లేదు. తరిగేది లేదు. అయితే ఇంక జరగాల్సిందేమి?


అందుకే అంకయ్య ఆ హరిజనవాడలన్నీ కాలికి బలపం కట్టుకొని తిరిగినాడు. అందర్నీ ఒక చోట చేర్చినాడు. ఒక రాత్రి కాదు. రెండు రాత్రులు కాదు. ప్రతి రాత్రీ అందరు ఒకచోట చేరుతున్నారు. అంకయ్య అభిప్రాయాల్ని విని కొందరు ఔనంటున్నారు. కొందరు కాని పనికి కష్టం జాస్తి అని పెదవి విరిచేస్తున్నారు. అయినా అంకయ్య 'ఏది ఏమైనా అందరు ఒక దారిన నడవాల్సిందే!' అన్నాడు. పండు వొలిచి అరచేతిలో పెట్టినట్లు వాళ్ళ బతుకులెట్లుండాయో విడమరిచి విశదీకరించినాడు. తమకు జరుగుతున్న అన్యాయాల్ని, తమ కర్తవ్యాన్ని ఎత్తిచూపినాడు. అందరు విన్నారు. 'ఔగదా మరి?' అని ఒకరితో ఒకరు అనుకొన్నారు. అందరు ఒక మాట మీద నిలబడవలసిందే! అని నిర్ణయించుకున్నారు. అంకయ్య ఏనుగునెక్కినంత సంబరపడినాడు.

ఒక శుభ ముహూర్తాన అందరు ఒక త్రాటిపై నిలబడినారు. ఊరి కల్లంత దవ్వుల్లో అయిదెకరాల పోరంబోకు స్థలాన్ని ఆక్రమించుకున్నారు. అందరు కలిసి కట్టుగా రాత్రింబవళ్ళు కష్టపడినారు. దాదాపు వంద గుడిసెలు తయారైనాయి. అంతకు మునుపు రాళ్ళు రప్పల్తో, ముండ్ల పొదల్తో కాలూన లేకుండా వుండిన ఆ ప్రాంతం ఇప్పుడు వరసబెట్టి కట్టిన గుడిసెలు వొదిగిన కోడిపెట్టల్లా కనిపిస్తాంటే చూడముచ్చటగా వుంది. ఒక్కొక్క కుటుంబం ఒక్కొక్క గుడిసెను ఆక్రమించుకొంది. దాపుగా వుంటుందన్న ధైర్యంతో ఆ కాలనీకి ఒక ప్రముఖ రాజకీయ నాయకుడి పేరు కూడా పెట్టుకున్నారు.

అయినా వాళ్ళ ఎత్తులు పారలేదు.

హరిజనులందరు ఒక్కటైతే వచ్చే యిక్కట్లను ఊహించుకోలేని అమాయకులు కాదు అగ్ర వర్ణస్థులు. అందుకే వాళ్ళు తలకింత అని చందాలు వేసుకున్నారు. మండలాధికార్ని మంచి చేసుకున్నారు.

ఇరుసుకు కందెన వేస్తే చక్రం గిరగిర తిరుగుతుంది. అధికార్ల చేతికి ఆముదం రాస్తే జరగవలసిన పనులు చరచర జరుగుతాయి. ఒకరోజు మండలాధికారి తయారైనాడు. మంది మార్బలంతో వాడ ముందు ప్రత్యక్షమైనాడు. కలెక్టరుగారి ఉత్తర్వులన్నాడు. ఖాళీ చేసి తీరాల్సిందే! అన్నాడు. దేశంలో భూమి అన్యాక్రాంతమై పోతున్నదని ఆగ్రహించినాడు. క్రమశిక్షణ బొత్తిగా లేకుండా పోతున్నదని ఆక్రోశించినాడు.






ఇటీవల విజయనగరం సాహితీ మిత్ర సమాఖ్య విజయభావన ఏర్పాటుచేసిన కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ దశమ వర్థంతి సభలో ప్రసంగిస్తున్న శ్రీ పేరాల భరతశర్మ. వేదికపై శ్రీయుతులు వై. సంగయ్య, ఉమామహేశ్వరరావు, పట్టాభిరామయ్య వున్నారు

జనులు బాధ్యతారహితులై ప్రవర్తిస్తున్నారని ఆవేదన పడినాడు. బుల్‌డోజర్ పెట్టి కొట్టించేస్తానన్నాడు. ఎవ్వరు తన మాటల్ని ఖాతరు చెయ్యకపోయేసరికి వెనక్కు ముందుకు ఊగినాడు. వెనకా ముందు ఆలోచించకుండా అన్నంత పనికి తయారైనాడు.

అంకయ్య కడుపు రగిలింది. కనుబొమ ముడి పడింది. చేతులు ముడుచుకొని కూర్చుంటే చేటు తప్పదనుకొన్నాడు. కాలుగాలిన పిల్లిలా యింటింటికి తిరిగినాడు. ఇంటిల్లిపాదినీ రమ్మన్నాడు. క్షణాల మీద అందరు ఒక చోట చేరేసరికి అంకయ్య వాళ్లవైపు తిరిగినాడు. అతని కండ్లల్లో చింతనిప్పలు కురుస్తున్నాయి.

"ఇప్పుడు మీరంతా శ్రద్ధగా నా మాటినండి. ఒంట్లో చీమూ నెత్తురుంటే నా మాటినండి. చచ్చేది నిజం. బదికేదపద్ధం. మా రాజుల జోలికే పోతే వీళ్ళను మూతి మింద తన్నారని మన లాంటోళ్ళను ఆడించాలని చూస్తున్నారు. ఇప్పుడు మనం కావీ గాజులు తొడుక్కున్నట్లు మూల కూర్చుంటే ముండ మోపి పోతాం. అదేం కుదర్దు. నా మాటినండి. నాదేవుండాది. నేనుండే దాక్కణ్ణే. వెనకా ముందెవ్వరూ లేరు. అందరికంటే ముందుగా నేనే బుల్‌డోజర్ కడ్డంగా పడుకుంటా! నా తర్వాత మీరందరు పడుకోండి. నేను చస్తేనే కదా మీరందరూ చచ్చేది. ఎట్లా చంపతారో చూద్దాం! ఎట్లా చస్తావో చూద్దాం!' అంటూ నోట్లో మాట నోట్లో వుండగానే వెళ్ళి బుల్‌డోజర్ కడ్డంగా పడుకొన్నాడు. అంకయ్య పడుకొనేసరికి ఆ గుడిసెల్లో ఆడా, మగా, పిల్లా జెల్లా వరసగా కట్టకట్టినట్లు బుల్‌డోజర్ కడ్డంగా పడుకొన్నారు.

అది చూసి మండలాధికారి శివతాండవం చేసినాడు. ఆ శివతాండవం ప్రళయతాండవమైనా ఆ గుంపుకు చీమ కుట్టినట్లనిపించకపోయేసరికి ఎగిరి జీపులో పడినాడు. తిరిగి మళ్లీ చూడకుండా టౌన్‌కి వెళ్ళినాడు.

సాయుధులై పోలీసులు దిగినారు.

చంకన కెమెరా తగిలించుకొని వాళ్ళ వెనుకనే జర్నలిస్ట్లు దిగినారు.

పోలీసులు గుడిసెవాసుల్ని బెదరగొట్టడానికి ప్రయత్నాలు చేసినారు. పత్రికల వాళ్ళు ఫోటోలు తీసినారు. ఆ మరుసటిరోజే "గుడిసెలపై గూండాయిజం! ఇదేనా సోషలిజం?' అని ప్రాస చెడకుండా ప్రముఖంగా ప్రకటించినారు.

గుడిసెల్ని ఖాళీ చేసే ప్రయత్నం వాయిదా పడింది.

గుడిసెవాసులంతా ఒకటై 'జై బోలో అంకయ్యకు!' అన్నారు.

గ్రామస్థులు మాత్రం కల్లు తాగిన కోతుల్లా కదను తొక్కినారు. 'ఎట్లయినా సరే! వీళ్ళందర్నీ ఒక పట్టు బట్టి చూడాల్సిందే! అనుకొన్నారు. అవకాశం దొరకాల కదా? అంతవరకు ఓపిక తప్పదు కదా? అనుకొన్న జనులు హరిజనుల్ని మామూలుగానే పనిపాటకు పిలుస్తున్నారు. హరిజనులు అడ్డం చెప్పకుండా పోతున్నారు. చెప్పిన పనుల్ని చెప్పినట్లు చేస్తున్నారు. తమకు రావలసింది అడిగి తెచ్చుకొంటున్నారు. పొద్దు పుడుతూ వుంది. పోతూ వుంది. రోజులు అతి సహజంగా దొర్లిపోతున్నట్లే వుంది. అయినా ఒకరి మీద యింకొకరికి ద్వేషం. నిప్పు లేకనే రగులుతూ వుంది. రగిలి రగిలి ఎప్పుడు రావణాసురుడి కాష్టంగా మారుతుందో అని జనులు ఆలోచిస్తున్నారు. హరిజనులు ఆలోచిస్తు న్నారు. సాకు దొరికితే చాలు. సాధించాలని తాపత్రయ పడుతున్నారు.

హరిజనులకు చేద బావి అప్పుడూ లేదు. ఇప్పుడూ లేదు.

ఇంతకాలం వాళ్ళు మోట బావుల నీళ్ళ మీదే ఆధారపడినారు. 'నీళ్ళు లేకపోతే మనిషి నిమిషం బతకలేదు. ఆ నీళ్ళ మిందనే దెబ్బ కొడ్తే?! తల దిరిగి మోట దగ్గరికొస్తారు కొడుకులు!'' అని ఆలోచించినారు ఊళ్ళోవాళ్ళు! అయితే ఆ కొట్టే దెబ్బ దెబ్బ కొట్టినట్లని పించకూడదు. కనిపించకూడదు. ఆ దెబ్బతో నాయాండ్లు గుక్క దిప్పకోలేక గిలగిల్లాడిపోవాల!'' అని ఆలోచించి ఆలోచించి అందరు ఒక నిర్ణయానికి వచ్చినారు. ఆ ఆనందంతో చంకలు తట్టుకొన్నారు.

మోటు తోలేటప్పుడు ఎద్దులు మోటబావిలో పేడ వేస్తుంటాయి. ఆ పేడను బావి పక్కన్నే కుప్పతోసి పెట్టుంటారు. మోట విడిచిపెట్టినప్పుడా పేడంతా ఎత్తి బావి పక్కన్నే దిబ్బేస్తుంటారు. కానీ యిప్పుడా పేడను మోటబావి మొగదల కుప్ప తోసి పెడ్తున్నారు. వాడలో ఆడది కడవ చంకన బెట్టుకొని కంట పడ్తేచాలు. ఎడం కాలితో ఆ పేడను కొంచెం కొంచెంగా దోనెలో తోస్తున్నారు. మోటబావి దోనెలో కుమ్మరిల్లితే నీళ్ళన్నీ పేడమయమే!

కాలువ గట్టున నిలబడి ఆ స్త్రీ కాలువ వైపు చూస్తుంది. కలిపిన కళ్ళాపి నీళ్ళలా కాలువలో నీళ్ళు వగలు పడ్తూ పోతుంటాయి. చూస్తూ నిట్టూరుస్తుంది. అటుపై మోట తోలుతున్న మనిషి వైపు చూస్తుంది. కండ్లల్లో తృప్తి తొణికిసలాడుతున్నా తనకేమీ తెలియనట్లుగా, ఏమీ పట్టనట్లుగా తనేమో, తన పనేమో ఆ వ్యక్తి మోట తోలుతుంటాడు. మనస్సు చివుక్కుమంటుంది. చివుక్కుమన్నా, కలుక్కుమన్నా- ఉలిక్కిపడలేని కడజాతి, చేసేది లేక గిరుక్కున వెనక్కు తిరుగు తుంది. చరచర ముందుకు నడుస్తుంది. ఇంకొక్క బావి దగ్గరికి వెళ్ళి నిలబడుతుంది. అక్కడా అంతే!-

అక్కడ మాత్రమే కాదు- ఆ ఊళ్ళ క్రింద బావుల దగ్గరంతా అంతే!

పాపం! ఆ యిల్లాలు వట్టికడవతో వాడ చేరుతుంది. చుట్టుచుట్టి వచ్చి చుట్టు గుడిసెలో కూలబడుతుంది. కన్నీళ్ళతో కడవ నింపలేక కలవరపడుతుంది. తాగడానికి గుక్కెడు నీళ్ళు లేక ఆ గుడిసెలో పిల్లాజెల్లా నకనకలాడ్తారు.

ఆ ఒక్క గుడిసెలోనే కాదు- వాడలో గుడిసెల గతంతా అంతే!

అంతే అయితే యింకేం చెయ్యాలని వాడలోని వాళ్ళంతా చేరి తర్జనలు భర్జనలు పడుతున్నారు.

"వాళ్ళు పిలిస్తే పనిపాటకు పొయ్యేది మానేస్తాం'' అన్నాడొకడు.

"మానేస్తే తిండి లేకుండా నిగిడి చస్తాం?'' అన్నాడింకొకడు.

''ఇప్పుడు మాత్రం తాగేదానికి నీళ్ళు లేకుండా సస్తా వుండ్లేదో!'' అని మొదటివాడిని సమర్థించినాడు మూడోవాడు.

''పనులు మానేదీ వద్దు. పస్తులు పడి చచ్చేదీవద్దు.

నీళ్ళు లేక అల్లాడేదీ వద్దు'' అంకయ్య నోటిమాట రాతికి టెంకాయ కొట్టినట్లు వినిపించింది.

''అదెట్లా కుదుర్తుంది?''

కొంతకు కొంతమంది కాదు. అందరి సందేహం అదే!

''ఎందుక్కుదర్దు? ఊళ్ళో చేదబావిని తవ్వింది మనం. అయినా మనం ఆ నీళ్ల చేదుకోవడానికి లేదు. ఈ ఊళ్ళ కింద దిగుడుబావులన్నీ తవ్వింది మన తాతలో, ముత్తాతలో. అయినా ఆ బావుల్లో మనం దిగడానికి లేదు. కనీసం రెండు కడవల నీళ్ళు మోట తోల్తా వుంటే తెచ్చుకొనడానికి లేదు. ఎంతకాలం యిట్లా పాకులాడేది?''- అని నిలదీసి అడిగినాడు అంకయ్య.

''అయితే యిప్పుడేం చెయ్యాలంటావ్?''

''మన కాళ్ళమీద మనం నిలబడాల. మన నీళ్ళు మనం తాగాలి. అంటే మన చేద బావి మనం తవ్వుకోవాల!''

''అది మన వల్ల అయ్యే పనేనా?''

''ఎందుగ్గాదు? ఇన్ని బావులు తవ్వినోళ్ళం. మన బావిని మనం తవ్వుకోలేమా?''

''వాళ్ల దగ్గిర దుడ్లుండాయి''

''మన దగ్గిర శక్తి ఉండాది.''

వాళ్ళ దగ్గర శక్తి ఉందని వాళ్ళల్లో ఒక్కడు చెప్పేదాక వాళ్ళకు తెలియకపోయింది. తెలిసేసరికి పారా పలుగు చేతబట్టివాడంతా పొలోమని కదిలింది.

వాడకు ఈశాన్యమూలగా వంకదారి. ఆదారి పక్కన్నే మర్రిమాను. ఈ మానికింద చేరినారు. కొందరి చేతుల్లో పారలున్నాయి. కొందరి చేతుల్లో గడ్డపారలున్నాయి. మరి కొందరి చేతుల్లో తట్టలున్నాయి.

అందరు అంకయ్యవైపు ఆతురతగా మాస్తున్నారు.

అంతలోనే అంకయ్య అటుతిరిగి యిటు తిరిగి మొర్రితొర్రిలేని మూరెడు పొడుగు రాతిని చేతికందుకున్నాడు. ముంతడు నీళ్ళతో కడిగినాడు. పసుపు పూసి కుంకుమ బొట్లు పెట్టేసరికి ఆ శిల దేవుడయింది. ఆ శిలను మర్రిమాను బోదె కానించినాడు. దేవుడు కొలువు తీరినాడు. కొలువు తీరిన దేవుడికి గవ్వకా యంత కర్పూరం వెలిగించి టెంకాయ కొట్నాడు. సాగిలపడి మొక్కినాడు.

అంకయ్య మొక్కేసరికి అందరూ అదే పని చేస్తున్నారు.

అప్పుడు అంకయ్య గడ్డపార చేతికందుకొన్నాడు. 'జై గంగా భవానీ!' అంటూ గడ్డ పారను శక్తి కొద్దీ పైకెత్తి మొదటి ఘాతం వేసినాడు. అంతే! పని ప్రారంభమయింది. కొందరు తవ్వుతున్నారు. కొందరు పారల్తో మట్టిని తట్టలకెత్తుతున్నారు. తట్టలకెత్తిన మట్టిని కొందరు అల్లంత దూరంలో కుప్ప పోస్తున్నారు.

చేదబావి తవ్వకం చకచక సాగిపోతూ వుంది.

ఈ వార్త క్షణాలమీద ఊరు చేరింది.

''ఆ! మూగోడబ్బాలని ఆ రాళ్ళరప్పలో నీళ్ళు పడిన కాలానిక్కదా?'' అని ఊరు తేలిగ్గా నవ్వేసింది.

''రాళ్ళో రప్పలో!- అంతు తేల్చుకోవాల్సిందే!'' అని ఉడుం పట్టుతో ఉపక్రమించింది వాడ.

అయితే తాగడానికి నీళ్ళు?-

ఆ నీళ్ళకోసరమే కదా చేదబావిని తవ్వుతున్నారు. చేదబావిని తవ్వాలికదా?- తవ్విన బావిలో నీళ్ళు పడాలి కదా? అంతవరకు?- అదే సమస్యగా పరిణమించింది.

రాత్రిపూట దిగుడుబావుల్లో దిగి దొంగతనంగా అయినా నాలుగు కడవల నీళ్ళు తెచ్చుకుందామంటే- ఊళ్ళోవాళ్ళు యింటికొక్క మనిషిగా మోటబావుల దగ్గర కావలి కాయనట్టే కాస్తున్నారు. ఇక చేద బావుల సంగతి సరేసరి!

వాడలో ఆడవాళ్ళు పాపం! కోడి కూతతో నిద్ర లేస్తున్నారు. అయిదారు మైళ్ళు నడుస్తున్నారు. అక్కడ గుంటల్లోనో, చెరువుల్లోనో లేకుంటే మోటబావుల దగ్గర్నో రెండు కడవలు కావిడి గట్టి తెచ్చుకొంటున్నారు.

కుర్రకారు అడవుల మీద పడి కుందేటి కొమ్ముల్ని తెస్తున్నారు. అడవుల్లో కుందేళ్ళుంటాయి. వాటికి కొమ్ములుంటాయా? అనుకోవచ్చు. కుందేటి కొమ్ములంటే? చూడడానికవి నల్లేరు కాడల్లా వుంటాయి. అయితే నల్లేరు కాడల్లా పొడుగ్గా పెరగవు. జానెడు పొడుగు కటోయిటోగా గుబురుగా పెరుగుతాయి. వాటిని నములుతుంటే- పులుపు తీపు కలగలిసినట్లుంది. అయితే నమిలిన తర్వాత ఎంత శ్రమ పడినా రెండు మూడు గంటల వరకు నోట్లో తడి ఆరదు. ఎండాకాలం అడవుల్లో పశవులకాపర్లకు యిదే పరుసవేది. వాడలో పిల్లోళ్ళు అడవుల్లో ఎంతదూరమైనా వెళ్ళి కుందేటి కొమ్ముల్ని సాధిస్తున్నారు. తెచ్చి చేద బావి తవ్వుకుతున్న వాళ్లకందిస్తున్నారు.

అది కూలి సేద్యం కాదు. సొంత సేద్యం. ప్రతి వొక్కడు వొళ్ళు వంచి పనిచేస్తున్నాడు. రాత్రింబ వళ్ళు తెలియకుండా పనిచేస్తున్నారు.

నెల తిరగలేదు. బావి అరేదు మట్లు తెగింది. అక్కడ గంగా భవాని ప్రత్యక్షమయింది. ప్రళయ తాండవం చేస్తూ ప్రత్యక్షమయింది.

వాళ్ళ ఆనందానికి ఆకాశమే హద్దు!

జనులు తాగే నీళ్ళల్లో పేడ కలిపినారు. హరిజనులు కొత్త నీళ్ళను కడవలకు తోడి పసుపు కలిపినారు!

బావలమీద మరదండ్లు... మరదండ్ల మీద బావలు... మామల మీద అల్లుళ్ళు... అల్లుళ్ళ మీద మామలు... పిల్లలు వావివరుసలు పాటించకుండా వరస బెట్టి అందరి మీదా వసంతం చల్లుకొన్నారు. 'జై బోలో అంకయ్యకు! జై బోలో గంగా బవానీకి!' అని అరుస్తూ ఆడినారు. ఎలపదాలు పాడినారు. ఏ మొగాన్ని చూచినా మొగమంతా వ్యాపించిన వెలుగు... కన్నుల్లో కాంతి... పెదవులపై చిరునవ్వు... ఏ గొంతులో విన్నా ఏదో కూనిరాగం! వాళ్ళ విజయోత్సాహం ఒక ఉత్సవమే అయింది.


ఇది చెవినపడి ఊరు చిన్నపోయింది!

తమ పాచిక పారలేదని ఊళ్ళో ప్రతి గుండె తల్లడిల్లింది. ప్రతి మనస్సు ఆక్రోశించింది. ''ఈ పూట బాయి తొవ్వుకున్నారు. రేపు గుడి కట్టుకుంటారు. మళ్ళీ ఒక బడి పెట్టుకుంటారు. ఆ మిందట గుడిసెలు కట్టుకునే దానికి పోరంబోకు నేల కొట్టేసినట్టే సేద్యానికి బూవులు సంపాయించుకుంటారు. అప్పుడు వాళ్ళ సేద్యం వాళ్ళదవుతుంది. అప్పుడు మన గతి అదోగతేకదా? అట్లా కాకూడదనుకుంటే ఎదురు పబ్బాన్ని దెబ్బతియ్యాల! అదెట్లా జరుగుతుందబ్బా?'' అని ప్రతి మనిషి చాలా తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

అసలు వేడికి వాళ్ళ ఆలోచనల వేడి తోడయినట్లుంది. ఆ వేడిలో ఆకాశం కడిగి తోసినట్లైంది. కలికాని కంత మబ్బు తునక కనిపించకుండా పోయింది.

ఆ ఏడాది చినుకు నేల రాల్లేదు!

వర్షాధారంతో బతికే ప్రాంతం. ఆ ప్రాంతంలో పడే వర్షం కూడా అంతంత మాత్రమే! అది ప్రతి ఏటా పడుతుంటేనే అంతో యింతో సాగుబాటు. ఒక యేడు



మట్టగిస్తే చాలు. పరిస్థితి మహా దారుణంగా తయారవుతుంది. తాగడానికే నీళ్ళుండవు. తాగడానికే లేకపోతే యింక పంటలకేముంటాయ్? పంటలు పండకపోతే తివడానికి తిండి కరువు. గొడ్డూ గోదకు మేపు కరువు.

ఆ ఏడాది వర్షం లేకపోయేసరికి ఆ ప్రాంతంపై కరువు రక్కసి దాడి చేసింది.

ఊళ్ళో చేద బావులు ఎండిపోయినాయి. ఆ ఊరి కింద దిగుడు బావులు అడుగంటినాయి. పైర్లు ఎండిపోతున్నాయి. తాగడానికి నీళ్ళు లేక దినగండం మారేండ్లాయుష్షుగా విషమించింది.

అయితే హరిజనవాడ చేదబావిలో మాత్రం చేదే కొద్దీ నీళ్ళే!

ఊళ్ళో వాళ్ళ కన్ను ఆ బావి మీద పడింది. పడ్తే ఏం చెయ్యాలి? నీళ్ళివ్వమని అడగాల! ఒకప్పుడు వాళ్ళడిగితే నీళ్ళేం చేసినారు? అది మనస్సులో మెదిల్తే అడగడానికి మొగం చెల్లడం లేదు. మొగం చెల్లకపోతే ప్రాణం?- దాని తీపి దానిది. పోగొట్టుకుంటే ఆ తీపిని పోగొట్టుకోవాల! లేకుంటే ఊరొదిలి ఊరుగాని ఊళ్ళకు వలస పోవాలి, కొంపా గోడూ, కయ్యా కాలవ వొదిలిపెట్టి పోవా అంటే మాటలా? అందుకే అభిమానాన్ని చంపుకు న్నారు. అంకయ్య దగ్గరికి వెళ్ళినారు.

వాళ్ళు ఎందుకొచ్చిందీ అంకయ్యకు తెలుసు. ఏనాటికో ఒకనాటికి రాక తప్పదనీ తెలుసు. కానీ ఏమీ ఎరగనట్లే- 'కాకితో కబురంపితే ఒచ్చేవాణ్ణి కదయ్య! ఇంతదూరం మీరు రావాల్నా?'' అని వినయం ఉట్టిపడేలా అన్నాడు.

''అంకన్నా! మా బుద్ధి గెడ్డి తినింది. మేం జేసిందేవో తప్పే. మా తప్పును మేవు వొప్పుకుంటా వుండాం!''

అందితే జుట్టు. అందకపోతే కాళ్ళు పట్టుకొనే తత్వం అందంగానే పలికింది.

''రావ! రావ! మీరేం తప్పు చేసినారయ్యా?- అట్లాంటి తప్పేదైనా చేస్తే కడజాతోడే చెయ్యాల.మీరు పెద్ద పెద్దోళ్ళు. తమ నోళ్ళల్లో యింత చిన్న చిన్న మాటలు రావడం యేం బాగాలేదయ్యా?''

''సచ్చిన పావుల్నే సావగొడ్తే ఎట్టా?''

''తమరు మాట్లాడ్తావుండేది నాకేవీ తలకెక్కవంటావుండాదయ్యా!''

''తెల్నోడికైతే చెప్పొచ్చు. తెల్సీ తెల్నట్టు మాట్లాడ్తే ఏం చెయ్యాల?''

''పైన యిదొక నిందనా?''

''మాటకుమాట పెంచుకుంటా పోతే వొచ్చిందీ లేదు. వొరిగిందీ లేదు. గొంతు తడుపుకోను నీళ్ల లేకుండా గిలగిల్లాడి సస్తావుంటే నువ్వేవీ ఎరగనట్టే ఎకసెక్కెం వాడ్తే యింక మేవేవి మాట్లాడేదబ్బా?''


ఆ మాట చెవిని పడేసరికి అంకయ్య వొళ్ళు రగిలింది. ''మేం చావలా? అప్పుడు మీరేం చేసినారు?'' అని నిలదీసి అడగాలనుకొన్నాడు. అయినా నిబ్బరించుకున్నాడు.

''అయితే నన్నిప్పుడేం చెయ్యమంటారు?''

''ఏవీ లేదంకన్నా! మీ బాయిలో మానావరిగా నీళ్ళుండాయి కదా? కరంటు మోటారు పెట్టేసి పైపు లైను లాగేద్దాం. మీకు చేదే పని తప్పుతుంది. మా పాణాలు గెట్టెక్కి గెడ్డన పడ్తాయి.''

''ఎంత మాటెంత మాటయ్యా! కూలి చేస్తే కుండగాలు. లేకుంటే కడుపులు కాలే బతుకులు మావి. మాకెందుకయ్యా మోటార్లు, గీటార్లు. అంత పని చేసేస్తే, ఈ దొంగ వెధవలు సుఖం మరిగిపోతారు. ఆ తర్వాత మీకే లేనిపోని తకరారు. మా చేతుల కష్టం మాకుండాది. వెళ్ళిరండయ్యా, వెళ్ళిరండి!'' అని రెండు చేతులెత్తి దండం పెట్నాడు.

వాళ్ళ ఊళ్ళో పెద్ద పెద్ద మనుష్యులు, అంకయ్య ముందు మాత్రం చిన్న చిన్న మనుష్యులై తలలు వంచినారు. వంచిన తలలెత్తకుండా నడిచినారు. ఒకప్పుడు తమ ముందు చేతులు చాపిన మండలాధికారి ముందర నిలబడి తలలు పైకెత్తి చేతులు జోడించినారు.



జోడించిన చేతుల్ని జోడించినట్టే పెట్టుకుని జరిగింది, జరిగినట్లు విన్నవించుకొన్నారు! ఇంక జరిగేదెట్లా?' అని మొత్తుకున్నారు.

వాళ్ల కుయ్యో మొర్రో మని మొత్తుకుంటుంటే మండలాధికారి అరచేతులవైపు అలవోకగా చూసుకుంటున్నాడు. ఆ తర్వాత ఎన్ని ఆముదం పూతలు పడినా, వాళ్ళు పూసిన పూత మాత్రం అన్ని పూతల వెనుక స్పష్టంగా కనిపిస్తూంటే 'అయ్యో పాపం!' అన్న సానుభూతి గుండెల్లో మెదిలింది. వెంటనే అందరు కలసికట్టుగా వెళ్ళి కలెక్టరు గారి కాళ్ళమీద పడండహో!' అని ఉచిత సలహా పారేసినారు.

''అవసరవొస్తే ఏ-ఁకుదేవుడే గాడిద కాళ్ళు పడ్తే మాకిదొక లెక్కా? పక్కా!'' అని మీసాల్ని మెలివేసినారు ఊరిపెద్దలు. గంటలమీద కలెక్టర్ బంగళా చేరుకొన్నారు. 'తాగే నీళ్ళు తెచ్చుకొంటుంటే హరిజనులు అటకాయించారు బాబో!' అని నెత్తీ నోరు మొత్తుకుంటూ కలెక్టర్ కాళ్ళ మీద పడినారు. నెత్తి,తిత్తి కొట్టే రకం పెద్ద మనుష్యులు.

నీటి సమస్య. అందులో తాగే నీటి సమస్య. అంటే మనిషి ప్రాణానికి సంబంధించిన సమస్య- కలెక్టర్ కోపోద్రిక్తుడైనాడు.

''వాళ్ళు ఆక్రమించుకొన్న పోరంబోకు భూములకు యింకా పట్టా కూడా మంజూరు కాలేదే? అంటే- అది ప్రభుత్వానికి చెందిన భూమి. ఆ భూమిలో బావి. ఆ బావిలో నీళ్ళు.-అంతా ప్రభుత్వానిదే! ప్రభుత్వమంటే ఎవరు? ప్రజలే! ప్రజలకు ఎదురు తిరగడమంటే ప్రభుత్వాన్ని ఎదిరించినట్టేకదా?'' తనలో తాను గొణుక్కున్నట్లే పైకి అన్నాడు కలెక్టర్

కాళ్ళమీద పడినవాళ్ళ కండ్లు మిలమిల మెరిసినాయి.

''ఇక మీరు వెళ్ళవచ్చు. నేను రేపే మీ గ్రామానికి వస్తున్నా. వాళ్ళు నీళ్ళెట్లా యివ్వరో నేనూ చూస్తాను!''

హామీదాగా హామీ యిచ్చినాడు కలెక్టరు.

కాళ్లమీద పడినా ఫలితం దక్కినందుకు పరవశించిన పెద్దలు ఆ హామీ నెత్తి భుజాల మీద వేసుకొని గ్రామాన్ని చేరినారు.

కలెక్టర్ ఆ మరుసటి రోజే ఆ గ్రామానికి వస్తున్న సంగతి నిముషాలమీద యిటు ఊళ్ళో, అటు వాడలో కూడా పాక్కింది. గుడిసెల గుండెల్లో కలవరం పుట్టింది. అయినా అంకయ్య అదరలేదు. బెదరలేదు. అందర్నీ నోళ్ల మూసుకుని జరిగేది చూస్తూ వుండమన్నాడు.

ఆ మరుసటిరోజు మండలాధికారి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, గ్రామ సహాయకులు,గ్రామస్తులు అందరు కలసి ఊరి ముందర చేరినారు. కలెక్టరుగారి కోసరం నిరీక్షిస్తూ, కలెక్టర్ వస్తే హరిజన వాడ తనిఖీ చేస్తే తమకు జరగబోయే మంచిని, హరిజనులకు జరగబోయే వద్దనని చర్చించుకుంటూ కలల్లో తేలిపోతున్నారు. అంతలో కలెక్టర్ రానే వచ్చినాడు. అందరు కలసి హరిజనవాడ చేరుకున్నారు.

కలెక్టరు కారు దిగీ దిగగానే అంకయ్య అంతకు మునుపే కట్టించిన సందెడు లావు పూలదండను కలెక్టర్

మెడలో వేయించినాడు.

తన చేతకాని తనానికి సిగ్గుపడ్తూ జనులు ఒకరి మొగం ఒకరు చూసుకొంటున్నారు.

"పూలమాలలు కాదు నాక్కావలసింది. తాగే నీళ్ళు యివ్వనని చెప్పిందానికి కారణం.ఎవడబ్బ సొత్తని నీళ్ళడిగితే లేదన్నారు? చెప్పండి. కరువు కాలంలో తాగే నీళ్ళు యివ్వననడం అమానుషం. నీళ్ళెత్తుకపోతానంటే ఎందుకు అటకాయించినారో చెప్పండి!" సందెడు లావు పూల దండను తీసివేయడానికి సతమతమవుతూ కలెక్టర్ అడుగుతున్నాడు.

"మేమెవర్నీ అటకాయించలేదు దేవరా!"

అంకయ్య వినయంగా విన్నవించుకున్నాడు.

"అటకాయించడం కాదు. అసలు వీలేలేదన్నారటగా?"

"నా పేరు అంకడయ్యా!"

"అంటే?" ఆశ్చర్యాన్ని వ్యక్తంచేసినాడు కలెక్టర్.

"అంకడు కాకుండా శంకరుడైతే గంగను సిగలో దాచిపెట్టుకొని వీలుగాదు పొండి! అనేవాణ్ణి. కర్ణాటక ముఖ్యమంత్రి అయుంటే తెలుగుదేశంతో పేచీ పెట్టుకునేవాణ్ణి. పోనీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యుంటే కర్ణాటకతో కయ్యానికి దిగేవాణ్ణి. కడజాతి వాడికంత అదృష్టమా దేవరా?"

"అమ్మో! కూత ఘనంగా వుందే?"

"దేవరా! మానోళ్ళు తెరిచి మేము నీళ్ళివ్వము!- అని చెప్పలేదు. కరెంటు మోటారు పెట్తాం. పైపు లైను లాగిస్తాం- అంటే వద్దాన్నాను. మా రెక్కల కష్టం మాకుండాదన్నాను. అంతకుమించి ఒక్కమాట మాట్లాడానేమో మీరే అడగండి!"

అంకయ్య మాట తీరుకు, వినయానికి ముగ్ధుడైనాడు కలెక్టర్. కర!

ఒక్కసారి గ్రామస్థులవైపు తీక్షణంగా చూచినాడు.

మూగెద్దుల మాదిర వాళ్ళు తలలు వంచుకొన్నారు.

"అయ్యా! మేవీ బావిని తవ్వుకోక మునుపు నీళ్ళకు మమ్మల్ని ఊళ్ళో అడుగు పెట్టనిచ్చినారేమో మీరే అడగండి. చేదుకుంటామంటే వప్పుకోలేదు. పోనీ చేది పొయ్యమంటే- 'మాల నాకొడుకులకు మేవు సేది పొయ్యాల్నా?' అని గుద్దురిమిరి. మోట బావుల కాడ కడవ కంటపడ్తే నీళ్ళల్లో పేడ కలిపిరి.అప్పుడు మేమంతా వొచ్చి దొరగారితో చెప్పుకోలేదే?"

పల్లెటూళ్ళో వ్యక్తి, అందునా హరిజనుడు అంత చక్కగా సంస్కారయుతంగా మాట్లాడుతూంటే కలెక్టర్ ఆశ్చర్యంగా చూస్తున్నాడు. అది గమనించిన మండలాధికారి 'అంకయ్య మిలటరీ రిటర్న్డ్ సార్!" అన్నాడు.

"అలా చెప్పండి!"అంటూనే కలెక్టర్ "అంకయ్యా! అపకారికి ఉపకారం చెయ్యమన్నారు పెద్దలు. ఒక చెంప మీద కొడ్తే యింకొక చెంప చూపమన్నాడు గాంధీ మహాత్ముడు."

"నేను కాదనడం లేదు కదయ్యా?"

"అంటే-నీళ్ళివ్వడానికి మీకేం అభ్యంతరం లేదన్న మాట!"



భారతీయ ఉత్సవంలో భాగంగా లింకన్ సెంటర్ (న్యూయార్క్)లో ఏర్పాటయిన సంగీత, నృత్య కార్యక్రమంలో భరతనాట్యం ప్రదర్శిస్తున్న ప్రఖ్యాత కళాకారిణి మాళవిక సరుక్కాయ్

"మాకేం అభ్యంతరమూ లేదు. అయితే ఒక్క కండీషన్!"

"ఏమిటది?"

"మేము చేది పోస్తాం. వాళ్ళను తీసుకొని పొమ్మనండి!"

జనుల తలలు గిర్రున తిరిగినాయి. మండలాధికారి, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్, గ్రామ సహాయకుల తలలు దిమ్మెక్కినాయి. కలెక్టర్ కూడా ఆశ్చర్యంగా చూస్తుంటే-

"దేవరా! కులానికొక్క చెంబు. చెంబు కొక్క గంగ. చెంబు ఏ కులానిదైతే గంగ ఆ కులానిదైపోతున్నది. గంగకు అంటు లేదంటూనే జాతికొక గంగను చేస్తున్నారు. లేకుంటే తెలుగు గంగేంది? తమిళ గంగేంది? కర్ణాటక గంగేంది? మహారాష్ట్ర గంగేంది?- మనదంతా ఒక జాతి అంటూనే ఒడ్డున కూర్చుని వాదులాడుకుంటా వుండాం. పోనీ! మేము చేది పోస్తామనే కుందికి చూడండి ఆ మొగాలెట్లా మాడిపోతున్నాయో?- పిచ్చిగానీ! మా రాజులు మాలగంగను తాగతారా దేవరా?"

"గాంధీ ఎప్పుడో పుట్టాడన్నారు. కాదయ్యా కాదు. గాంధీ యిప్పుడు పుట్టాడు!"

ఆనందంతో ఉక్కిరి బిక్కిరవుతూ కలెక్టర్ అంకయ్యను కౌగిలించుకొన్నాడు.

"జై బోలో! అంకయ్య గాంధీకి!" అని హరిజనులు నినదిస్తుంటే వాడ మారుమోగింది. జనుల మొగాలు మాడిపోతున్నాయ్!

ఎవరో వాడలో ఒక చిన్నది, వయసున ఉన్నది అంకయ్య మావతో వసంతం ఆడాలని మనసు పడిందేమో! చేద బావిలో చరచర దుత్తను వదిలింది. అల మీద అల లేచింది. అవి అలలు కావు. గంగమ్మ తల్లి నవ్వుల గలగలలు!